## క్లుప్తంగా

### కవులు, కళాకారులు సమాజ నిర్దేశకులు


విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న సభ్యులు

ముమ్మిడివరం: సమాజానికి కవులు, కళాకారులు దిశా నిర్దేశకులని, వారిని ఆదర్శంగా తీసుకుని యువత ముందుకు సాగాలని ప్రముఖ తెలుగు పండితుడు, ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత డాక్టర్ పుణ్యమంతుల అర్జునరావు అన్నారు. స్థానిక మోకా గణపతిరావు జూనియర్ కళాశాలలో కళాసాహితీ వ్యవస్థాపకుడు పచ్చిమాల శివనాగరాజు అధ్యక్షతన సోమవారం సంస్థ 19వ వార్షికోత్సవం జరిగింది. ముఖ్యఅతిథి డాక్టర్ అర్జునరావు, కళాశాల ప్రిన్సిపాల్ పీఎల్ ప్రశాంతి మాట్లాడుతూ, లలిత కళల సేవలో తరిస్తున్న కళా సాహితీ సేవకులు అభినందనీయులన్నారు. కవుల జీవితాలపై అనర్గళంగా ప్రసంగించిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేశారు.

### కొబ్బరి చెట్ల వేలం

తాళ్లరేవు: సుంకరపాలెం పంచాయతీ పరిధిలో ఉన్న కొబ్బరిచెట్లకు సోమవారం నిర్వహించిన వేలంపాటలో పంచాయతీకి రూ.4.56 లక్షల ఆదాయం సమకూరింది. స్థానిక పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ టిల్లపూడి నాగేశ్వరరావు సమక్షంలో డిప్యూటీ ఎంపీడీఓ ప్రకాశరావు, పంచాయతీ కార్యదర్శి వలీబాబా అధ్యక్షతన బహిరంగ వేలంపాట నిర్వహించారు. ఐదు ప్రాంతాల్లోని 215 కొబ్బరిచెట్లకు మూడేళ్ల కాలానికి వేలంపాట జరిగింది.

### పీహెచ్‌సీ సిబ్బంది ధర్నా


ధర్నా చేస్తున్న వైద్యులు, సిబ్బంది

ఐ.పోలవరం: నిత్యం ఆకతాయిల అల్లర్లను, వేధింపులను భరించలేకపోతున్నామని వైద్యారోగ్య సిబ్బంది ఆందోళనకు దిగిన ఘటన ఐ.పోలవరం మండలంలో చోటుచేసుకుంది. టి.కొత్తపల్లి పీహెచ్‌సీ వద్దకు నిత్యం కొందరు ఆకతాయిలు మద్యం సేవించి రావడం, తమతో వాగ్వాదాలకు దిగడం, బెదిరించడం చేస్తున్నారంటూ వైద్యులు, సిబ్బంది సోమవారం ధర్నా చేశారు. ఆసుపత్రిలో విలువైన సామగ్రిని సైతం ధ్వంసం చేస్తున్నారని వారు ఆరోపించారు. వీరిని కఠినంగా శిక్షించడంతో పాటు, తమకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. దీనిపై జిల్లా కలెక్టరేట్, ఎస్పీ, డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఫిర్యాదు చేస్తామని చెప్పారు.

### పెంటాథ్లాన్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

యానాం: ఇంటర్ డిస్ట్రిక్ట్ మోడరన్ పెంటాథ్లాన్ చాంపియన్‌షిప్ పోటీల్లో స్థానిక రీజెన్సీ పబ్లిక్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపారని హెచ్‌ఎం ప్రసాదరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాకినాడలో జరిగిన ఈ పోటీల్లో అండర్-13 విభాగంలో (400 మీటర్ల పరుగు, 50 మీటర్ల ఈత)లో జీఎల్ఎస్ హర్ష బంగారు పతకం, అండర్-11లో హేమవర్షిణి రజత, అండర్-9 బాలికల విభాగంలో ఎస్ మృద్వికవర్షిణి బంగారు పతకాలను సాధించారని ఆయన తెలిపారు.

### రూ.423.6 కోట్లు వినియోగించలేదు

యానాం: పుదుచ్చేరి ప్రభుత్వం సింగిల్ కన్సాలిడేటెడ్ అకౌంట్‌లో రూ.423.6 కోట్లను వినియోగించలేదని సోమవారం సెంట్రల్ ఆడిట్ అండ్ అకౌంట్స్ కమిటీ నివేదికను విడుదల చేసింది. సీనియర్ డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ పి.సుకేంద్ర మాట్లాడుతూ, కేంద్ర వాటా రూ.298.22 కోట్లు, రాష్ట్ర వాటా రూ.235.94 కోట్లు మొత్తం రూ.534.16 కోట్లు గతేడాది మార్చి 31న పుదుచ్చేరి ప్రభుత్వ సింగిల్ కన్సాలిడేటెడ్ ఖాతాకు బదిలీ చేయబడిందన్నారు. పుదుచ్చేరి ప్రభుత్వ విభాగాల్లో గతేడాది మార్చి వరకు 316 మోసం, డబ్బు నష్టం, అవకతవకలకు సంబంధించి ఘటనలు జరిగాయన్నారు. మొత్తం రూ.28.89 కోట్లు ఖజానాకు నష్టం వాటిల్లిందన్నారు.

### జీఎస్టీ మినహాయింపుపై సంబరం

అమలాపురం టౌన్: జీవిత బీమా పాలసీలపై జీఎస్టీ మినహాయింపుతో పాలసీదారులకు మేలు చేకూరుతుందని ఎల్ఐసీ అమలాపురం బ్రాంచి మేనేజర్ సుధాకరరెడ్డి అన్నారు. స్థానిక ఎల్ఐసీ కార్యాలయం వద్ద ఏఓఐ, లియాఫీ యూనియన్ల ఆధ్వర్యంలో జీఎస్టీ తొలగింపు సందర్భంగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఆయా సంఘాల ప్రతినిధులు సానబోయిన వీరభద్రరావు, సుందరసీడి శ్రీనివాసరావు, ఏబీఎం మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

### చెత్త తొలగించకపోతే ఉద్యమం

అమలాపురం రూరల్: బండారులంక పరిధిలోని 16 వార్డుల్లో సుమారు 11 నెలలుగా చెత్తను పంచాయతీ సిబ్బంది ట్రాక్టర్ల ద్వారా తరలించడం మానేశారని గ్రామస్తులు పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌కు సోమవారం వినతిపత్రం అందించారు. గ్రామంలో దోమలు పెరిగి అంటు రోగాలు ప్రబలుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. చెత్తను తరలించకపోతే ఉద్యమం చేపడతామని స్పష్టం చేశారు.

# కరుణించవమ్మా.. దుర్గమ్మ

- విశేషాలంకరణలో అమ్మవార్ల దర్శనం
- భక్తులతో పోటెత్తిన ఆలయాలు

అమలాపురం టౌన్: విజయ దశమి పర్వదినం సందర్భంగా శరన్నవరాత్ర మహోత్సవాలు సోమవారం పట్టణంలోని అమ్మవార్ల ఆలయాల్లో వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయాలను పూలదండలు, మామిడి తోరణాలతో అలంకరించారు. తెల్లవారుజాము నుంచే అమ్మవార్ల ఆలయాలకు భక్తుల పోటెత్తారు. పట్టణంలోని శ్రీదేవి అమ్మవారు, కన్యకా పరమేశ్వరి అమ్మవారితో పాటు, పట్టణంలో దాదాపు 54 కనకదుర్గ ఆలయాల్లో అమ్మవార్ల దర్శనాల కోసం భక్తులు క్యూ కట్టారు. కుంకుమ పూజలు, హోమాలు, ప్రత్యేక పూజలతో అమ్మవార్ల ఆలయాలు ఆధ్యాత్మిక కేంద్రాలుగా మారాయి. శ్రీదేవి, కన్యకా పరమేశ్వరీదేవి ఆలయాల్లో తెల్లవారుజాము నుంచి రాత్రి వరకూ భక్తులు అమ్మవార్లను దర్శించుకుంటూనే ఉన్నారు. దాతల సహకారంతో శ్రీదేవి అమ్మవారి ఆలయం వద్ద భారీ అన్నదానం జరిగిందని ఉత్సవ కమిటీ చైర్మన్ గంగాబత్తుల రాంబాబు తెలిపారు. కన్యకా పరమేశ్వరీదేవిని తొలుత పట్టణ ఆర్యవైశ్య ప్రతినిధులు వెండి పల్లకీలో ఊరేగించారు. స్థానిక గడియార స్తంభం సెంటరు నుంచి గోదావరి జలాలను 108 కలశాలతో ఆర్య వైశ్య మహిళలు ఆలయానికి ఊరేగింపుగా తీసుకొచ్చి, అమ్మవారికి జలాభిషేకం చేశారు. వైశ్య సంఘం అధ్యక్షుడు నంబూరి సత్యనారాయణమూర్తి, సలహాదారులు వంకాయల కాశీ, వరదా సూరిబాబు, ఉత్సవ కమిటీ చైర్మన్ అప్పన వీరన్న తదితరులు ఆయా కార్యక్రమాలను పర్యవేక్షించారు. స్థానిక సుబ్బారాయుడి చెరువు వద్ద బాలాత్రిపుర సుందరీ సమేత శ్రీచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో అమ్మవారికి మహిళలు సామూహికంగా కోటి కుంకుమార్చన పూజలు


పల్లవారిపాలెం ఆలయంలో బాలత్రిపుర సుందరీదేవిగా..

జరిపించారు. తొలి రోజు శ్రీదేవి అమ్మవారు బాలాత్రిపుర సుందరీదేవిగా, వేంకటేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలోని కనకదర్గమ్మ స్వర్ణ కవచ దుర్గాదేవిగా, స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలోని కల్యాణ దుర్గమ్మ బాలాత్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. నారాయణపేట, సూర్యాపేట, కొంకాపల్లి, గాంధీనగర్, కార్మిక నగర్, వెత్సావారి అగ్రహారం తదితర ప్రాంతాల్లోని అమ్మవార్ల ఆలయాల్లో శరన్నవరాత్ర మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి.

**బాలాత్రిపుర సుందరీదేవి అలంకరణలో..**

తాళ్లరేవు: దేవీ శరన్నవరాత్ర మహోత్సవాలు ఊరూరా ఘనంగా ప్రారంభమయ్యాయి. మండలంలోని ప్రముఖ ఆలయాలతో పాటు, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపాల్లో అమ్మవారిని తొలిరోజు బాలాత్రిపుర సుందరి అలంకరణలో పూజలు నిర్వహించారు. ప్రధానంగా తాళ్లరేవు ప్రధాన రహదారిలోని కనకదుర్గ


వాడపర్రులో గాజుల అలంకరణతో మందాలమ్మ వారు

ఆలయం, వాసవీమాత ఆలయం, గ్రాంటులోని పాల కనకదుర్గమ్మ ఆలయం, జార్జీపేట దుర్గామల్లేశ్వరస్వామి, కోరంగి దుర్గామల్లేశ్వరస్వామి తదితర ఆలయాల్లో కలశస్థాపన చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇంజరంలోని హరశ్రీ నిలయంలో భాగ్యశ్రీ అమ్మవారి అలంకరణలో పూజలు జరిగాయి. నీలపల్లిలో ప్రముఖ ఆధ్యాత్మికవేత్త కంచెర్ల వెంకట నాగేశ్వరరావు ఆధ్వర్యంలో వేద పండితుడు పెద్దింటి వెంకట లక్ష్మణాచార్యులు నేతృత్వంలో విశేష పూజలు నిర్వహించారు. పాతకోరంగిలోని పురాతన శివాలయంలో అర్చకులు కేఆర్‌కే సాయిప్రసాద్ ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాభిషేకం, అమ్మవారికి సామూహిక సువాసినీ పూజ, మహిళలతో సామూహిక లలితా సహస్ర పారాయణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

**వాడవాడలా దసరా వేడుకలు**

ముమ్మిడివరం: నియోజకవర్గంలో శరన్నవరాత్ర


దేవగుప్తంలో బాలాత్రిపుర సుందరీదేవిగా..

మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. వాడవాడలా కనకదుర్గమ్మ ఆలయాల్లో అమ్మవారిని అలంకరించి, ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారు బాలాత్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ముమ్మిడివరంలో కుమ్మర్లవీధి, మార్కెట్ సెంటర్, మెయిన్ రోడ్డు, రాజుపాలెం, గోదశివారి పాలెం, క్రాప చింతలపూడి, సోమిదేవరపాలెం, అయినాపురం, చిన కొత్తలంక, పల్లవారిపాలెం, లక్ష్మీదేవి లంక, ఠానేల్లంకతో పాటు, అనేక గ్రామాల్లో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

**అమ్మవారికి ప్రత్యేక పూజలు**

ఉప్పలగుప్తం: దేవి శరన్నవరాత్ర ఉత్సవాలను పురస్కరించుకుని మండలంలోని వివిధ గ్రామాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలి రోజు అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు చేసి,


అమలాపురంలో గోదావరి జలాల కలశాలతో వైశ్య నాయకులు, మహిళల ఊరేగింపు

అన్న సమారాధన ఏర్పాటు చేశారు. మండలంలోని గొల్లవిల్లి పంచాయతీ వాడపర్రు గ్రామంలో ఉన్న మందాలమ్మ అమ్మవారిని గాజులతో ప్రత్యేకంగా అలంకరించారు.

అల్లవరం: మండలంలో దేవీనవరాత్రుల ఉత్సవాలను వైభవంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయాలను విద్యుద్దీపాలతో సుందరంగా తీర్చిదిద్దారు. తొలి రోజున బాలాత్రిపుర సుందరీదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. దేవగుప్తంలో విజయదుర్గ అమ్మవారి ఆలయంలో చిట్టూరి శ్రీనివాసరావు, వెంకటలక్ష్మి దంపతులు కలశస్థాపన, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. అల్లవరం, మొల్లేటిగరువు ఆలయాల్లో విజయదుర్గ అమ్మవారి ఆలయంలో చండీయాగం, కుంకుమార్చన పూజలు జరిగాయి.

కాట్రేనికోన: శరన్నవరాత్రుల సందర్భంగా విజయ దుర్గమ్మను తొలిరోజు బాలాత్రిపుర సుందరిగా అలంకరించారు. చింతలమెర గ్రామంలో విజయ దుర్గాదేవి అమ్మవారికి పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.



అలంకారంలో దర్శనమిస్తున్న అమ్మవారు


అమలాపురం బాలాత్రిపుర సుందరీ సమేత చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో పూజలు


నీలపల్లిలో అమ్మవారికి పూజలు చేస్తున్న వేద పండితులు


ముమ్మిడివరం మెయిన్ రోడ్డులో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు


అమలాపురం శ్రీదేవి అమ్మవారి ఆలయంలో భక్తుల సందడి



## 'ఉండ్రు' సోదరులకు సత్కారాలు


బాబ్జీని అభినందిస్తున్న పార్టీ నాయకులు


వెంకటేష్‌ను సత్కరిస్తున్న నేతలు

అమలాపురం టౌన్: పట్టణానికి చెందిన వైఎస్సార్ సీపీ నేతలు, సోదరులు ఉండ్రు వెంకటేష్, ఉండ్రు బాబ్జీని పార్టీ నేతలు సోమవారం వేర్వేరుగా సత్కరించారు. పార్టీ రాష్ట్ర బూత్ కమిటీల విభాగం కార్యదర్శిగా వెంకటేష్, రాష్ట్ర సోషల్ మీడియా వింగ్ కార్యదర్శిగా బాబ్జీని పార్టీ కేంద్ర కార్యాలయం నియమించడంపై నియోజకవర్గ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. పార్టీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ వారిని అభినందించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ముమ్మిడివరం, మండపేట నియోజకవర్గాల పరిశీలకుడు చెల్లుబోయిన శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నాయకులు ఉండ్రు సోదరుల ఇళ్లకు వెళ్లి సత్కరించారు. మున్సిపల్ కౌన్సిలర్లు గొవ్వాల రాజేష్, దొమ్మేటి రాము, పార్టీ నాయకులు కముజు రమణ, చెల్లుబోయిన నాని, కుంచే స్వామి, కె.స్వర్ణశేఖర్, బొంతు రాజు, కుంచే సుబ్బు, దొంగ చిన్నా, పాటి రవి, దొంగ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## పని గంటల పెంపుపై అభ్యంతరం

**ఉపసంహరణకు సీఐటీయూ డిమాండ్**

అమలాపురం టౌన్: రాష్ట్రంలో ఇంత వరకూ అమలులో ఉన్న 8 గంటల పనిదినాన్ని 10 గంటలకు మారుస్తూ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై సీఐటీయూ జిల్లా శాఖ అభ్యంతరం తెలిపింది. తక్షణమే ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసింది. కార్మికులు, ఉద్యోగుల చట్టబద్ధ హక్కుగా ఉన్న 8 గంటల పనిదినాన్ని మార్చడం సరికాదని స్పష్టం చేసింది. అమలాపురంలోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశం ఈ నిర్ణయాన్ని ఖండించింది. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూకల బలరామ్ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. పనిదినాన్ని 10 గంటలకు మారుస్తూ అసెంబ్లీలో కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం ఏకపక్షంగా ఉందని సంఘ జిల్లా అధ్యక్షుడు జి.దుర్గాప్రసాద్



సమావేశంలో పాల్గొన్న దుర్గాప్రసాద్, బలరామ్

ధ్వజమెత్తారు. 1920లోనే స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా 8 గంటల పనిదినం నినాదాన్ని అప్పట్లో మహాత్మా గాంధీతో పాటు, వివిధ కార్మిక సంఘాలు పిలుపునిచ్చిన విషయాన్ని వక్తలు గుర్తు చేశారు. ఈ నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో కార్మిక, ప్రజా సంఘాల ప్రతినిధులు విపర్తి మోహనరావు, అమూల్య తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ రెవెన్యూ సహాయకుల ధర్నా

అమలాపురం రూరల్: రాష్ట్ర గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం పిలుపు మేరకు తమ డిమాండ్ల పరిష్కారానికి జిల్లా వీఆర్‌ఏల సంఘం ఆధ్వర్యంలో స్థానిక నల్ల వంతెన వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు వీరభద్రరావు, జిల్లా ఉపాధ్యక్షుడు మోకా సత్యనారాయణ, డివిజన్ అధ్యక్షుడు త్రినాథ్ ఆధ్వర్యంలో 500 మంది వీఆర్‌ఏలు ధర్నాలో పాల్గొన్నారు. పేస్కేల్ అమలు చేయాలని, అర్హులైన వారికి ప్రమోషన్లు కల్పించాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలని, నామినీ వీఆర్‌ఏలను క్రమబద్ధీకరించాలని డిమాండ్



ధర్నా చేస్తున్న గ్రామ రెవెన్యూ సహాయకులు

చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ధర్నాకు ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దాల బాపూజీ మద్దతు తెలిపారు.

## వీఆర్వోపై ఫిర్యాదు

అల్లవరం: మ్యూటేషన్ చేసి భూమిని ఆన్‌లైన్‌లో చేర్చడానికి దేవగుప్తం వీఆర్వో రూ.10 వేలు డిమాండ్ చేసినట్టు దేవగుప్తం గ్రామానికి చెందిన పచ్చిమాల రమేష్ కలెక్టర్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. తన తండ్రి పచ్చిమాల రామ్మూర్తి మరణానంతరం తల్లి సత్యవతి పేరిట 347/1 సర్వే నంబర్‌లో 40 సెంట్ల భూమిని మ్యూటేషన్ చేసి, ఆన్‌లైన్‌లో నమోదు చేయడానికి అవసరమైన పత్రాలు వీఆర్వోకు అందించానన్నారు. మ్యూటేషన్‌కు తొలుత రూ.వెయ్యి ఇచ్చానని చెప్పారు. ఏడాదిన్నరగా భూమి ఆన్‌లైన్ కాకపోవడంతో రైతు భరోసా, పీఎం కిసాన్ పథకాలు లబ్ధి చేకూరలేదని తెలిపారు. మ్యూటేషన్ పూర్తి కావాలంటే ఉన్నతాధికారులకు రూ.10 వేలు ఇవ్వాలని వీఆర్వో వత్తిడి చేస్తున్నారన్నారు. ఈ విషయాన్ని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని తెలిపారు. దీనిపై సమగ్ర విచారణ చేయాలని రమేష్ ఆ ఫిర్యాదులో కోరారు.

## విద్యుత్ ఉద్యోగుల భారీ ర్యాలీ

**సమస్యలు పరిష్కరించాలని డిమాండ్**

అమలాపురం రూరల్: విద్యుత్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ విద్యుత్ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక నల్ల వంతెన ధర్నా చౌక్ వద్ద నుంచి వందలాది మంది ఉద్యోగులు ర్యాలీలో పాల్గొన్నారు. రాష్ట్ర పవర్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ, రాష్ట్ర డిస్కం ఐక్య కార్యాచరణ కమిటీ ఆదేశాల మేరకు అన్ని డివిజన్లలో యూనియన్లు, అసోసియేషన్ల నుంచి పెద్దఎత్తున ఉద్యోగులు హాజరయ్యారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని నినాదాలు చేశారు. విద్యుత్ ఉద్యోగులు ప్రమాదాలు బారిన పడుతున్నారని, వారికి ప్రత్యేక బీమా ఏర్పాటు చేయాలని కోరారు. ఎనర్జీ అసిస్టెంట్లను జూనియర్ లైన్‌మన్లుగా నియమించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే వరకు ఆందోళన విరమించేది లేదని జేఏసీ చైర్మన్ ఎంవీ రమణ, కన్వీనర్ రాజారత్నం స్పష్టం చేశారు. అనంతరం కలెక్టర్ మహేష్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు.



అమలాపురంలో ర్యాలీ చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, విద్యుత్ ఉద్యోగులకు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులకు పూర్తి వైద్య ఖర్చులు చెల్లించాలని, ప్రభుత్వంలో సీపీఎఫ్‌తో కూడిన పెన్షన్ నిబంధనలను 1999 ఫిబ్రవరి ఒకటి నుంచి ఆగస్టు 31 వరకు నియమింపబడిన ఉద్యోగులకు వర్తింపజేయాలని విజ్ఞప్తి చేశారు. కాంట్రాక్ట్ లేబర్, అవుట్ సోర్స్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఆగస్టు 2023లో విద్యుత్ సంఘాలతో కుదిరిన ఒప్పందం ప్రకారం యాజమాన్యమే నేరుగా వేతనాలు చెల్లించాలని కోరారు. అలాగే పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏడీఆర్‌లను మంజూరు చేయాలన్నారు.

## బాధిత కుటుంబాలకు పొన్నాడ పరామర్శ

ఐ.పోలవరం: మండలంలో వైఎస్సార్ సీపీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలను మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ సోమవారం పరామర్శించారు. కొమరగిరిలో అనారోగ్యం పాలైన రేవు సత్యాన్ని పరామర్శించారు. కొమరగిరి లైన్‌పేటలో మోర్త నారాయణ మరణించడంతో.. ఆయన కుటుంబ సభ్యులను, కొమరగిరికి చెందిన ఈత జానకిరామయ్య మరణించగా.. అతని కుమారుడు కొండబాబును పరామర్శించారు. ఎంపీపీ మిరియం జ్యోతి, జెడ్పీటీసీ సభ్యుడు సతీష్‌రాజు, పార్టీ నాయకులు వల్లభుని దొరబాబు, ఏలూరి ఆదినారాయణ, సకిలే వెంకటేశ్వరావు, వాసురాజు, గంగబాబు, కడలి శివ, ఆకుమర్తి కృష్ణ పాల్గొన్నారు.

తాళ్లరేవు: మండలంలోని నీలపల్లిలో గుండె శస్త్రచికిత్స చేయించుకున్న గంజా దుర్గారావు, అనారోగ్యంతో బాధపడుతున్న పాలెపు బాబూరావు, బత్తుల అరుణ్‌కుమార్, కూటమి మూకల దాడిలో గాయపడిన ఓలేటి చంద్రరావు, భార్య వియోగంతో బాధపడుతున్న మల్లాడి మాతరాజును పార్టీ నాయకులతో కలిసి మాజీ ఎమ్మెల్యే పొన్నాడ పరామర్శించారు. జార్జీపేట పంచాయతీ ఎంఎల్‌కే నగర్‌లో పువ్వల జయరాజు ఇటీవల మృతి చెందగా..


కొమరగిరిలో పరామర్శిస్తున్న పొన్నాడ

ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు.

**సూర్యనారాయణరాజుకు సత్కారం**

నియోజకవర్గ ఇంటెలెక్చువల్ విభాగం అధ్యక్షునిగా నియమితులైన విశ్రాంత వ్యవసాయ శాఖ జేడీ పెట్ల సూర్యనారాయణరాజును మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ ఘనంగా సత్కరించారు. సోమవారం జార్జిపేటలోని పెట్ల స్వగృహం వద్ద జరిగిన కార్యక్రమంలో సూర్యనారాయణరాజు, శాంతకుమారి దంపతులను పొన్నాడ దుశ్శాలువాతో సత్కరించి, అభినందించారు. పార్టీ యువజన విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి వుంగరాల సంతోష్, ప్రచార కార్యదర్శి దొరబాబు, నాయకులు దడాల జగదీశ్వరరావు, రెడ్డి నాగేశ్వరరావు, పేర్ని ఆదినారాయణమూర్తి పాల్గొన్నారు.

## జెడ్పీటీసీ సభ్యుడి పరామర్శ

ఉప్పలగుప్తం: పితృ వియోగంతో బాధపడుతున్న గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ మండల జేసీఎస్ కన్వీనర్ కోటుం లోవరాజును సోమవారం జెడ్పీటీసీ సభ్యుడు గెడ్డం సంపదరావు పరామర్శించారు. లోవరాజు తండ్రి కొండలరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. పార్టీ జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు జిన్నూరి వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు కడిమి చిన్నవరాజు, యర్రంశెట్టి రామచంద్రరావు, ఎంపీటీసీ సభ్యులు పెట్టా అప్పారావు, కొంకి ఏడుకొండలు, నాయకులు ఓగూరి విజయ్‌కుమార్, ఉండ్రు బాబ్జీ, చింతా రామకృష్ణ, పొగాకు శ్రీను


కొండలరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ, నాయకులు

తదితరులు కొండలరావు చిత్రపటానికి నివాళులర్పించారు.

### రాష్ట్ర స్థాయి పోటీలకు గొల్లవిల్లి విద్యార్థుల ఎంపిక


ముంగడ అలేఖ్య


తొత్తరమూడి అభిరామ్

ఉప్పలగుప్తం: మండలంలోని గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న తొత్తరమూడి అభిరామ్, ముంగడ అలేఖ్య రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారని పీడీ గొలకోటి ఫణీంద్ర సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అండర్-19 విభాగంలో అలేఖ్య, అండర్-17 విభాగంలో అభిరామ్ ఎంపికయ్యారని చెప్పారు. మంగళవారం నుంచి 26వ తేదీ వరకూ కర్నూల్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులను హెచ్‌ఎం జి.కనకదుర్గ, పీడీ డి.సరస్వతి, పీఈటీ వి.విజయభాస్కర్, ఉపాధ్యాయులు అభినందించారు.

### పాలిటెక్నిక్ కళాశాల సూపరింటెండెంట్‌గా రెయ్యా

యానాం: కొత్తగా స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల సూపరింటెండెంట్‌గా రెయ్యా శ్రీనివాస్‌ను నియమిస్తూ సోమవారం డీపీ అండ్ఏఆర్ శాఖ కార్యదర్శి వి.జయశంకర్ ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం శ్రీనివాస్ పుదుచ్చేరి పీడబ్ల్యూడీ శాఖలో రహదారులు, భవనాల విభాగంలో విధులు నిర్వహిస్తున్నారు.